నేడు యథావిధిగా పిజిఆర్ఎస్ కార్యక్రమం

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్) కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్ మోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ సోమవారం ఉదయం 9.30 గంటలకు ఆయా మండలాల్లో తప్పనిసరిగా హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. కావున అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

దసరా రద్దీ

- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- అక్కరకు రాని ప్రత్యేక రైళ్లు
- కిక్కిరిసిన సామర్లకోట రైల్వే స్టేషన్

ప్రజాశక్తి - సామర్లకోట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం తర్వాత అతిపెద్ద రైల్వే స్టేషన్ కావడంతో దసరా సెలవులు నేపథ్యంలో సామర్లకోట రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోతోంది. కాకినాడ, పిఠాపురం రైల్వే స్టేషన్లు ఉన్నప్పటికీ జిల్లాలో అన్ని ప్రాంతాల నుంచి సామర్లకోట చేరుకుని ప్రయాణాలు సాగించే జంక్షన్ కావడంతో సామర్లకోట మీదుగా రైలు ప్రయాణికులు ప్రజలు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు.

దసరా ఉత్సవాలు పురస్కరించుకుని పాఠశాలలు, కళాశాలలకు సుమారు పది రోజులు పైబడి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో పలువురు తమ సొంత ఊర్లకు, బంధువుల ఇళ్లకి వేసే ప్రయాణాలతో ఒక్కసారిగా రైల్వే స్టేషన్‌లలో రద్దీ వాతావరణం కన్పిస్తోంది.కాకినాడ జిల్లాలో ముఖ్య రైల్వే స్టేషన్‌లలో ఒకటైన సామర్లకోట రైల్వే స్టేషన్ జంక్షన్ ఆదివారం ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసింది. అంతంతమాత్రంగా రైల్వే అధికారులు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. తమ ప్రయాణానికి రాకపోకల నిమిత్తం పలువురు ముందస్తుగా ట్రైన్‌లో సీట్లు రిజర్వేషన్ చేసుకోగా మరికొందరికి సీటు రిజర్వేషన్ కాకపోవడంతో తమ పిల్లలతో ప్రయాణం సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్, బస్టాండ్ ల్లో ఇదే పరిస్థితి నెలకొంది. సామర్లకోట రైల్వే స్టేషన్ మీదుగా సాగించే రెగ్యులర్ రైళ్లలో విజయవాడ, ఇటు వైజాగ్ వైపు రాకపోకలు సాగించే రెగ్యులర్ రైళ్లలో సీట్లు అన్ని నెల క్రితమే భర్తీ అయ్యాయి. ఇప్పటికిప్పుడు ప్రత్యేక రైళ్లు వేస్తే తప్ప కాకినాడ జిల్లా రైలు ప్రయాణికులు ఇక్కట్లు తప్పేలా లేదు. కానీ ఆ దిశగా దక్షిణ మధ్య రైల్వే ఎలాంటి చర్యలు తీసుకోలేదని పలువురు ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. షాలీమార్ నుంచి చెన్నై, చెన్నై నుంచి షాలీమార్ ప్రత్యేక రైలును ఏర్పాటు చేసిన సామర్లకోట రైల్వే స్టేషన్‌లో హాల్ట్ ఇవ్వలేదు. కాకినాడ జిల్లా రైల్వే ప్రయాణికులు ఎటువంటి ప్రత్యేక రైళ్లు లేక దసరా సెలవులలో తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైలు లో సీటు దొరకపోవడంతో చాలామంది ప్రయాణికులు ఆర్‌టిసి, ప్రయివేటు బస్ సర్వీసులను ఆశ్రయించి తమ ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇదిలావుంటే ట్రైన్‌లో రిజర్వేషన్లు నిండుకోవడంతో ఇదే అదునుగా భావించి ప్రయివేటు బస్సు ఆపరేటర్లు ప్రయాణికుల నుంచి అధిక వసూళ్లకు తెరలేపారు.

సామర్లకోట రైల్వే స్టేషన్ లో కిక్కిరిసిన ప్రయాణికులు

రెండు ప్రత్యేక రైళ్లు

దసరా పండుగ సందర్భంగా రెండు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు సామర్లకోట స్టేషన్ మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఆదివారం 07215 నెంబర్ గల రైలు విజయవాడ నుంచి శ్రీకాకుళం వెళుతుందని, ఈ రైలు 6, 7, 8 మూడు రోజులు, 7, 8, 9 తేదీలలో శ్రీకాకుళం నుంచి విజయవాడకు వెళుతున్నట్లు చెప్పారు. అదేవిధంగా 07071 నెంబర్ గల రైలు కాకినాడ నుంచి సికింద్రాబాద్ 6వ తేదీన వెళ్లి 7వ తేదీన తిరిగి సికింద్రాబాద్ నుంచి కాకినాడకు వెళుతున్నట్లు తెలిపారు. కావున ప్రయాణికులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలని స్టేషన్ మేనేజర్ కె రమేష్ తెలిపారు.

ప్రజానాట్య మండలి కళాకారులతో అతిథులు

అలరించిన పిఎన్ఎం కళాకారుల ప్రదర్శనలు

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరంలో త్రిపుర సుందరి ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ప్రజా నాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆద్యంతం అలరించాయి. ప్రజా నాట్యమండలి కాకినాడ కార్యదర్శి లోవరాజు నేతృత్వంలో ఇలాంటి మట్ల త్రిపురతో రాసిన కమ్మనైన అమ్మపాట, కె.దేవేంద్ర రచించిన ఎక్కడమ్మా నువ్వు లేవిది, ఆర్.వాసు రచించిన నా చెమట చుక్క అంటూ సాగే పాటలకు నృత్య రూపకాలు ప్రదర్శించారు. డప్పు కళాకారుడు అర్జున్ తన వాయిద్యంతో సభికులను ఉర్రూతలూగించారు. గాయత్రి, వైష్ణవి అనే విద్యార్థినులు నవరాత్రుల విశిష్టత గీతానికి నృత్య ప్రదర్శన చేశారు. నాదసుధ మండా విజయకుమారి శిష్యులు సుజాత, శ్రీలక్ష్మి కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ దసరా ఉత్సవాల్లో ప్రజానాట్యమండలి కళ ప్రదర్శనలకు అవకాశం కల్పించిన ఆలయ కమిటీ అధ్యక్షులు గ్రంధి బాబ్జీ, కమిటీ సభ్యులకు, అధికారులు, కాశీప్రియ తదితరులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా కళలను ప్రోత్సహించి ఆదరించాలన్నారు. అనంతరం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చౌదరి చేతులమీదుగా లోవరాజు, అర్జున్‌లకు చిరు సత్కారం చేశారు.

ఆర్ఎంసి గ్రౌండ్‌లో వాకర్స్‌కు అనుమతి ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్లో వాకర్స్‌కు అనుమతి ఇవ్వాలని వాకర్సు ఎంఎల్ఎ వనమాడి కొండబాబును కోరారు. ఆదివారం రంగరాయ మెడికల్ కాలేజ్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎంసి గ్రౌండ్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. టూ టౌన్, మెయిన్ రోడ్, మసీద్ సెంటర్, జగన్నాధపురం బ్రిడ్జి మీదుగా ఎంఎల్ఎ ఇంటికి చేరుకున్నారు. అనంతరం ఎంఎల్ఎతో అసోసియేషన్ ప్రతినిధులు సుమారు అర్ధగంట పాటు చర్చించారు. ఈ మధ్య గ్రౌండ్లో జరిగిన దురదృష్టకరమైన సంఘటన తర్వాత గ్రౌండ్ మూసివేత వాకర్స్ ఇబ్బంది పడుతున్న తదితర పరిణామాలపై చర్చించారు. అనంతరం వాకర్స్ ప్రతినిధులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన సంఘటన ఆధారంగా గ్రౌండ్ వాకర్స్‌కు అనుమతి లేదని చెప్పడం దురదృష్టకరమన్నారు. గత 25 సంవత్సరాలుగా ఈ గ్రౌండ్‌ను వాకర్స్ పెద్దలు మట్టి, ఇసుక, మొక్కలు, లైట్లు వేసి ట్రాక్‌ను అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్తులో ట్రాక్‌లో ఎటువంటి సంఘటనలు జరగకుండా అసోసియేషన్ వెల్ఫేర్ సొసైటీ కమిటీ బాధ్యత వహిస్తుందని అసోసియేషన్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. మృద్ధులు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ గ్రౌండ్లో వాకింగ్ చేస్తే ఆక్సిజన్‌తోపాటు ఆరోగ్యంగా ఉంటారని, కావున ఉదయం 4:30 నుంచి 8:00 వరకూ సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు వాకర్స్ కోసం పర్మిషన్ ఇప్పించాలని కోరినట్లు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ వనమాడి మాట్లాడుతూ ప్రిన్సిపల్, ఇతర అధికారులతో మాట్లాడి వాకర్స్‌కు అనుమతిచ్చేలా ప్రయత్నం చేస్తానన్నారు. చిన్న చిన్న సంఘటనలు గ్రౌండ్లో జరిగిన అసోసియేషన్ బాధ్యత వహించాలని కొండబాబు సూచించారు.

ఎంఎల్ఎ వనమాడికి వినతిపత్రం ఇస్తున్న వాకర్స్

గ్రామాల అభివృద్ధిపై రెండు రోజుల శిక్షణ

ప్రజాశక్తి - కాజులూరు, పెద్దాపురం

గ్రామాభివృద్ధిపై పంచాయతీ వార్డు సభ్యులకు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జె.రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో మండల పరిషత్తు కార్యాలయంలో ఉపసర్పంచ్‌లకు, ఒక్కొక్క పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు గ్రామ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలోని ఉప సర్పంచులు, పంచాయతీ నుంచి ఇద్దరు వార్డు సభ్యులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు ఉంటాయని ఎంపిడిఒ శ్రీలలిత తెలిపారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ ద్వారా నిర్వహించే ఈ శిక్షణా తరగతులలో పంచాయితీ విధి నిర్వహణ, పాలన వ్యవహారాలు, అభివృద్ధి అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించబడుతుందన్నారు.

పర్యావరణ సమతుల్యతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు రూరల్

పర్యావరణ సమ తుల్యత కోసం అడవులను, వన్యప్రాణులను సంరక్షించాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. ఆదివారం కోరంగి అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రంలో స్వచ్ఛతాహి సేవ, వన్యప్రాణి వారోత్స వాలను నిర్వహించారు. ఎంపిపి రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొల్లంగి పర్యాటక కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి గర్రె సాయిలక్ష్మి, జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు, ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ వైస్ ఎంపిపి కనకాల సిద్ధి శేషారావు, టిడిపి నాయకులు గుత్తుల సాయి, మందాల గంగ సూర్యనారాయణ, పాల్గొన్నారు.

ఇడిసిల బలోపేతానికి కృషి

కోరంగి అభయారణ్యం పరిధిలోని ఇడిసిల బలోపేతానికి కృషి చేయాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సూచించారు. చొల్లంగి అభయారణ్యంలో జరిగిన కార్యక్రమంలో 18 ఇడిసిలకు రూ.36 లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ ఎస్-ఎస్ఆర్.వరప్రసాద్ మాట్లాడారు. 2021 నవంబర్ నాటికి కోరంగి అభయారణ్యంలోని ఎకో డెవలప్‌మెంట్ కమిటీ(ఇడిసి)లో కేవలం రూ.25 లక్షలు మాత్రమే ఉండేదని, నేటికీ రూ.1.75 లక్షల మూల నిధి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇడిసిలలో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని నాయకులు వాడ్రేవు వీరబాబు, కొపనాతి దత్తాత్రేయ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, ఇడిసి ఛైర్మన్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దస్త్రాల దోబూచులాటతో పాలన తగదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

దస్త్రాల దోబూచులాటతో విలీనం గ్రామాల్లో ప్రత్యేక పాలన తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు అన్నారు. ఆదివారం రూరల్ మండలంలోని వాకలపూడి, తూరంగి గ్రామాల్లో జరి గిన గ్రామ సభల్లో ఆయా పంచా యతీల కార్యదర్శులు పాండు రంగా రావు, జోగా రమణమ్మలకు ఆయన వినతిపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడేళ్ల క్రితం వాకలపూడి, వలసపాకల, రమణయ్య పేట, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి గ్రామాలను గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి వేరు చేసి మున్సిపల్ పట్టణాభివృద్ధి సంస్థకు అప్పగించారని తెలిపారు. గవర్నర్ ఆర్డినెన్సుతో అప్పటి సిఎం చంద్రబాబు విలీనంకు చర్యలు తీసుకోవడంతో గ్రామ దస్త్రాలను నగర పాలక సంస్థకు అప్పగించారని తెలిపారు. అయితే ప్రభుత్వ ఆదేశాలు లేకుండా అప్పటి జిల్లా కలెక్టర్ నీతూ కుమారి ప్రసాద్ వ్యక్తిగత ఆమోదంతో కార్పొరేషన్ నుంచి ఆ దస్త్రాలనువెనక్కి తీసుకెళ్లారని వివరించారు. దీంతో విలీన ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా గత తొమ్మిదేళ్లుగా కాకినాడ నగర పాలక సంస్థకు, 13 ఏళ్లుగా విలీనం గ్రామాలకు ఎన్నికలు లేకుండా పోయాయని అన్నారు. నాటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన సాగుతుందని, దీంతో ఆయా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. గ్రామాల విలీనంపై ప్రభుత్వానికి నివేదికను పంపించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం కో కన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్, మేడిశెట్టి వేంకటరమణ, సరగడ రాంబాబు, రెడ్డి పులిస్వామి పాల్గొన్నా రు.

వాకలపూడి కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న దూసర్లపూడి

ప్రశాంతంగా ముగిసిన సొసైటీ ఎన్నికలు

ప్రజాశక్తి - పిఠాపురం

ది పిఠాపురం అర్బన్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ పాలకవర్గ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం ఉదయం 8 గంటలు నుంచి 3 గంటల వరకు పోలింగ్ జరిగింది. అనంతరం కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఈ ఎన్నికల్లో జనసేన బలపర్చిన బాలిపల్లి రామచంద్రకుమార్‌కు 109 ఓట్లు, చెల్లుబోయిన ప్రమీలకు 138, అరిగెల ప్రసాద్‌రావుకు 179, మేళం రామకృష్ణకు 116, టిడిపి బలపర్చిన అభ్యర్థి అద్దంకి వెంకటరమణకు 198 ఓట్లుతో విజయం సాధించారు.

ఫలితాలు వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి దుర్గాప్రసాద్

కూటమి పార్టీల మధ్య అనైఖ్యత

టిడిపి, జనసేన పార్టీల మధ్య అనైక్యత మరోసారి బయటపడింది. సాధారణ ఎన్నికల్లో కనిపించిన అంత సఖ్యత లేదనే ప్రచారానికి తగ్గట్టుగానే అర్బన్ బ్యాంక్ సొసైటీ ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. ఏకపక్షంగా 5 స్థానాలకు 3 జనసేన, 2 టిడిపి నుంచి అభ్యర్థులను బలపరిచినట్లు జనసేన నాయకులు ప్రకటిం చారు. ఈ రోజు పోలింగ్‌లో టిడిపి బలపర్చిన అభ్యర్థి ఓడిపోవడంతో టిడిపి శ్రేణుల్లో నిరాశ కనిపిస్తోంది. టిడిపి అభ్యర్థి ఓటమికి జనసేన పార్టీయే కారణమనే అనుమా నాలను టిడిపి నాయకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమిలో అంతర్గత కుమ్ములాటలు రాబోయే కాలంలో ఎటువైపు దారి తీస్తాయో అన్న చర్చ సాగుతోంది.

భారీ బందోబస్తు నడుమ పోలింగ్

అర్బన్ బ్యాంక్ ఎన్నికలు భారీ బందోబస్తు నడుమ పోలీసులు ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. కాకినాడ డిఎస్‌పి రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎస్ఐలు మణికుమార్, వెంకటేష్, రామకృష్ణలతోపాటు స్పెషల్ పోలీసులు 15 మంది, లా అండ్ ఆర్డర్ పోలీసులు సుమారు 40 మంది ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీల భర్తీకి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని నవోదయ ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 9వ తరగతి ప్రవేశానికి 2010 మే 1 నుంచి 2012 జూలై 31వ తేదీ మధ్య జన్మించిన వారు, 11వ తరగతి ప్రవేశానికి 2008 జూన్ 1 నుంచి 2010 జూలై 31వ తేదీ మధ్య జన్మించిన వారు ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన జరుగుతుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పచ్చదనంతో మానవాళికి మనుగడ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

పచ్చదనం పరిశుభ్రతతో మానవాళికి మనుగడ సాధ్యమని వాకర్స్ అన్నారు. ఆదివారం స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడినప్పుడే మానవాళికి ఆరోగ్యం సమకూరుతుందని అన్నారు. మారుతున్న వాతావరణంలో భవిష్యత్తులో సంభవించనున్న విపత్తు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపనున్నదని అన్నారు. ఉష్ణోగ్రతలు మానవ శరీరాలు తట్టుకునే శక్తికి మించి ఉంటున్నాయని అన్నారు. వాతా వరణ మార్పు మానవ ఆరోగ్యంపై అధికంగా ప్రభావం చూపుతుందన్నారు. అనంతరం వాకర్స్, పార్కు సందర్శకులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, దాసరి శ్రీధర్ , ఇందుగుల ప్రసాద్‌నాయుడు, రేలంగి బాపిరాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని మరలావ 11 కెవి ఫీడర్‌పై ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ ఎవిఎన్‌డిఎస్.ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనివల్ల దివిలి సబ్ స్టేషన్ పరిధిలోని చదలాడ, ఉలిమేశ్వరం, కాండ్రకోట, గుడివాడ, సిరివాడ, మరలావ, తూర్పు పాకలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. దీనిని ఆయా గ్రామాల ప్రజలు గమనించాలన్నారు.

డిఎస్‌పిని కలిసిన ఏపూరి శ్రీను

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరి రాజును ప్రత్తిపాడు నియోజకవర్గ బిసి ఐక్య సంఘర్షణ సమితి కన్వీనర్ ఏపూరి శ్రీనివాసరావు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రత్తిపాడు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పలు సంఘటనలతోపాటు, ఆయనపై పెట్టిన కేసుల వివరాలను డిఎస్‌పికి వివరించారు.

దసరా ఉత్సవాల్లో ఎంఎల్ఎ చినరాజప్ప

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పి.వేమవరం గ్రామంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. గ్రామానికి వచ్చిన ఆయనకు గ్రామ టిడిపి నాయకులు ముసిరెడ్డి శ్రీరాములు, ముసిరెడ్డి రాంబాబు స్వాగతం పలికారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగ నృత్యం ప్రదర్శనను ఆయన తిలకించి, గరగ నృత కళాకారులతో చిన్నారులతో ఎంఎల్ఏ చినరాజప్ప ఫోటోలు దిగి ఉత్సాహపరిచారు. అలాగే సామర్లకోట భీమేశ్వరాలయంలో బాలా త్రిపుర సుందరిని శ్రీ లలితాదేవిగా అలంకరించారు. యాత్రికులకు ప్రసాదం పంపిణీ చేశారు.

నేటి నుంచి ఎంఆర్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 7 వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. బిఎ ఆనర్స్ పొలిటికల్ సైన్స్ 7, హిస్టరీ 30, స్పెషల్ తెలుగు 30, ఎకనామిక్స్ 30, బీకాం ఆనర్స్ జనరల్ 110, కంప్యూటర్ అప్లికేషన్ 11, బిఎస్‌సి ఆనర్స్ ఫిజిక్స్ 24, కెమిస్ట్రీ 13, బోటనీ 24, జువాలజీ 19, కంప్యూటర్ సైన్స్ 11, బిసిఎ ఆనర్స్ 35 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ ప్రవేశాలకు సంబంధించి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు కళాశాల అడ్మినిస్ట్రేషన్ విభాగంలో సంప్రదించవచ్చని సూచించారు.

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని మరిచి పేదల సొంత ఇంటి కలను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. సంక్షేమ బోర్డును గాలికి వదిలి నిర్మాణ కార్మికులను నట్టేట ముంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గత ప్రభుత్వ విధానాలతో నిర్మాణ కార్మికుల జీవితాలు నాశనం అయ్యాయని, పనులు లేక కార్మికులు అప్పుల పాలౌతున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు 4 నెలలు అవుతున్న నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుక ప్రజలకి అందజేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులతో పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

నారాయణమూర్తికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కాజులూరు

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కాజులూరు ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి తెలుగు వెలుగు నంది అవార్డును అందు కున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందు కున్నట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఉపాధ్యాయునిగా చేయూ త స్వచ్ఛంద సంస్థ ద్వారా సామాజిక సేవా రంగంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించి తెలుగు వెలుగు నంది జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారని తెలిపారు. నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ, కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ తెలుగు వెలుగు సాహితీ వేదిక, జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈ అవార్డును అంద జేశాయని తెలిపారు. ఈ సదర్భంగా ఆయనను స్థానిక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు జె.శామ్యూల్ బెన్‌హర్, కెవివి.సత్యనారాయణ, స్టాఫ్ సెక్రెటరీ కె.హరినాథ్, ఎంపిడిఒ రాంబాబు, ఎంఇఒలు, ఎన్ఆర్ఐ అన్యం శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఎంసి ఛైర్మన్ పి.పద్దరాజు అభినందించారు.

అవార్డును అందుకుంటున్న చింతా

కార్టూ'నిజం'



ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేల చెక్కు అందజేత

నూతన దంపతులకు చెక్కును అందిస్తున్న పౌండేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఇర్రిపాక గ్రామంలో నూతనంగా వివాహం చేసుకుంటున్న కొత్తపల్లి రమణ కుమార్తె వివాహానికి ఫౌండేషన్ ఛైర్మన్ జ్యోతుల మణి చేతుల మీదుగా ఆదివారం రూ. 20 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద కుటుంబాలలో ఆడబిడ్డలకు వివాహం జరిపించే సమయంలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాలని లక్ష్యంతో జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో తూచా తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. పేద ఇంటి ఆడబిడ్డ పెళ్ళికి 9 రోజుల ముందు ఫౌండేషన్ కార్యాలయం వద్ద వివరాలు నమోదు చేసుకుని తెలియజేస్తే సహాయాన్ని అందిస్తామని ఫౌండేషన్ కమిటీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్వా చిన్న బాబు, పంతం సత్యనారాయణ, జ్యోతుల సత్యమూర్తి, కోనేటి వెంకటేశ్వరరావు, జ్యోతుల వీరభద్రరావు, ఫౌండేషన్ కమిటీ గద్దె మారుతి, పుర్రె సూరన్న పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థినుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట విక్టర్ గర్ల్స్ హైస్కూల్లో 2007-08 బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి పూర్వ విద్యా ర్థునుల అపూర్వ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా 18 ఏళ్ల క్రితం పాము పాఠశాలలో చేసిన అల్లరి, చదివిన చదువులు ఉపాధ్యాయులు వైఖరిపై ఒకరికొకరు చర్చించుకుని హర్షా తిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు అరుణశ్రీ, జాయిస్, యానాక్షి, ఇందిరా, విజయ మేరీ, జాన్, రత్నకుమారి పూర్వ విద్యార్థులు పూల మాలలు, దుస్సాలువాలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు ధనదుర్గ, భాగ్యవతి, వీరలక్ష్మి ,శ్రీదేవి, సత్య, కవిత తదితరులు పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థునుల కలయిక

ప్రశాంతంగా ఎపి టెట్ ఆన్‌లైన్ పరీక్షలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదివారం ప్రారంభమైన ఎపి టెట్ -2024 ఆన్‌లైన్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 220 మందికి గాను 186 మంది హాజరుకాగా 34 మంది గైర్హాజరు అయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 224 మందికి గాను 185 మంది హాజరుకాగా 39మంది గైర్హాజరు అయ్యారని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

తమ్ముడిని హత్య చేసిన అన్న
-ఆస్తి తగాదాలే కారణం

ప్రజాశక్తి - తాళ్ళరేవు

మండలంలోని పి.మల్లవరంలో ఆస్తి తగాదాలతో తమ్ముడిపై దాడి చేసి అన్న హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. కాకినాడ రూరల్ సిఐ చైతన్య కృష్ణ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామంలో పత్తిగొంది వెళ్లే దారిలో చిన్న గుండం వద్ద నివాసముంటున్న అన్నదమ్ములు వెంటపల్లి ఏడుకొండలు, నూకరాజుల మధ్య గత కొన్నేళ్లుగా ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కొబ్బరి తోటలో కాయలు తీయించే విషయంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కోపోద్రేకుడైన అన్న ఏడుకొండలు తమ్ముడు నూకరాజును కత్తితో విచక్షణా రహితంగా నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన కొబ్బరి కాయల వ్యాపారిపైకి కత్తి దూయడంతో ఆయన ప్రాణభయంతో పరుగులు తీశారు. దీంతో అక్కడ నుంచి నిందుతుడు పరార య్యాడు. సంఘటనా ప్రాంతాన్ని సిఐ చైతన్యకృష్ణ, కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది సందర్శించారు. ఈ సంఘటనపై సిఐ మాట్లాడుతూ అన్నదమ్ముల మధ్య ఇల్లు, ఉమ్మడి ఆస్తుల తగదా ఉందని, ఈ నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని అన్నారు. ఇద్దరి మధ్య ఆస్తి తగాదా అంశం కోర్టులో ఉందన్నారు. నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - అన్నవరం

తొండంగి మండలం ఒంటిమామిడి సెంటర్లో బైక్‌పై వెళ్తూ ఒక యువకుడు ఆదివారం లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గోరసపాలెంకు చెందిన నేమాల ఉప్పాక(40) తన స్వగ్రామం నుంచి బైక్‌పై తొండంగి వెళ్తున్నాడు. మార్గ మధ్యలో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీ కొంటాడు. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - ఆలమూరు

చొప్పెల్ల లాకుల వద్ద ప్రధాన కాలువలో ఆదివారం గుర్తు తెలియని మృతదేహం లభించింది. ఎస్ఐ ఎం.అశోక్ తెలిపిన వివరాలు ఇవి.. చొప్పెల్ల లాకులు దాటిన తర్వాత కాలువలో సుమారు 40- 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానిక విఆర్ఒ ఉదయ్‌కుమార్‌కు సమాచారం వచ్చిందన్నారు. దీనిపై విఆర్ఒ పోలీసులు ఫిర్యాదు ఇచ్చారన్నారు. పోలీసులకు కాలువలో లభ్యమైన మహిళ మృతదేహం ఎత్తు సుమారు ఐదు అడుగుల రెండు అంగుళాలు ఉంటుందన్నారు. ఆమె మరణానికి గల కారణముతో పాటుగా ఊరు పేరు, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

పురుగు మందు తాగిన యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మతి చెందిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కరపోతు లక్ష్మీప్రవీణ్ అజయ్(22) తాపీ పని చేస్తూ జీవిస్తున్నాడు. గత నెల 25 తేదీ ఉదయం తాపీ పనికి వెళ్లాడు. అయితే మధ్యాహ్నం సమయంలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం అతనిని 108 వాహనంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అతనిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతిని తండ్రి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన తిరుమలయపాలెంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామ శివారు అటవీ ప్రాంతంలో పేకాడుతున్నారనే సమాచారం మేరకు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేసి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,500, 9 బైకులు స్వాధీనం చేసుకున్నారు. పేకాట శిబిరం నిర్వహిస్తున్న రాయి సూరిబాబుని అదుపులోకి తీసుకుని విచారించగా మరికొంతమంది శిబిరం నుంచి పరారైనట్టు తెలపారు. వారిమీద కూడా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక ఇంటి సరిహద్దు వివాదంలో జరిగిన ఘర్షణపై ఒక వ్యక్తిని గాయపరిచిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వారి వివరాలు ప్రకారం.. ఉచ్చిలి గ్రామానికి చెందిన చిట్టి మేను వెంకటేష్ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 3న తన ఇంటి పక్కన ఉన్న వరుసకు బంధువైన చిట్టి మేను రామకృష్ణ, అతని తల్లి ఇంటి సరిహద్దు వివాదంలో వెంకటేష్‌ను కర్రతో కొట్టి గాయ పరిచాడు. వెంకటేశు కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

9 వరకూ మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేస్తున్న ప్రయివేటు మద్యం షాపులకు ఈ నెల 9 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్ ఛార్జ్ ఎల్.చిరంజీవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన మరియు ఐ.పోలవరం మండలాల పరిధిలో మొత్తం 13 మద్యం షాపులకు దరఖాస్తులను ఈ నెల 9 సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. దరఖాస్తులను ఈ నెల 11న కలెక్టరేట్ కార్యాలయం నందు గోదావరి భవన్ లో దరఖాస్తు దారుల సమక్షంలో లాటరీ తీస్తారని ఆయన అన్నారు.

సాధారణ ఛార్జీలతో ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తితో జిల్లా ప్రజా రవాణా అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

దసరా సందర్భంగా సాధారణ ఛార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం నిమిత్తం హైదరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటున్న నేపథ్యంలో ఎక్కువ డిమాండ్ ఉండడంతో అధిక బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఎ డిపోల నుంచి ఎన్ని బస్సులు రాకపోకలు సాగిస్తాయి. ఏ విధమైన ఛార్జీలు వసూలు చేస్తారనే తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

హైదరాబాద్‌కు ఏయే తేదీల్లో బస్సులు వెళతాయి.?

కాకినాడ జిల్లాలో మూడు డిపోల పరిధిలో 288 ఆర్‌టిసి సర్వీసులు నడుస్తున్నాయి. ఈ దసరాకు ప్రత్యేకంగా 140 బస్సులను రెండు వైపులా తిప్పుతున్నాము. ఈనెల 8న కాకినాడ డిపో నుంచి 2 బస్సులు, తుని, ఏలేశ్వరం డిపోల నుంచి ఒక్కొ బస్సు, 9న కాకినాడ, ఏలేశ్వరంల నుంచి 3 చొప్పున, తుని నుంచి 2, ఏలేశ్వరం నుంచి 3, పదో తేదీన కాకినాడ నుంచి 7, తుని నుంచి 3, ఏలేశ్వరం నుంచి 4, 11న కాకినాడ నుంచి 6, తుని, ఏలేశ్వరంల నుంచి 5 చొప్పున తిరుగుతాయి.

ఇతర ప్రాంతాలకు సర్వీసులు ఎలా నడుస్తాయి.?

కాకినాడ, తుని, ఏలేశ్వరం ఆర్‌టిసి డిపోల పరిధిలో హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ, శ్రీకాకుళం వంటి ముఖ్య ప్రాంతాలకు బస్సులు నడపనున్నాము. ఈనెల 8 నుంచి 11 వరకు హైదరాబాద్‌కు 42, విజయవాడకు 20, విశాఖకు 20 చొప్పున ఏర్పాటు చేశారు. బెంగళూరుకు ఒక ప్రత్యేక బస్సు సర్వీసును నడుపుతున్నాం. వీటిలో సూపర్ లగ్జర్ 23, అల్ట్రా డీలక్స్ 14, ఎక్స్ ప్రెస్ సర్వీసులు 4 ఉన్నాయి. రద్దీకు అనుగుణంగా విజయవాడ, విశాఖపట్నం వరకు అదనపు సర్వీసులు నడుపుతాము.

ఛార్జీలను ఏమైనా పెంచారా.?

ఆయా మార్గాల్లో నడిచే బస్సుల ఛార్జీలనే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ వసూలు చేస్తాం. రాకపోకలకు కలిపి

ఒకేసారి ముందస్తు రిజర్వేషన్ చేసుకుంటే ఛార్జీలో 10 శాతం రాయితీ ఉంటుంది. ఇప్పటికే రిజర్వేషన్ల బుకింగ్ జరుగుతున్నాయి. ఈ ప్రత్యేక బస్సులు ఆయా డిపోల్లో సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఛార్జీల వివరాలు తెలియజేయండి.?

కాకినాడ నుంచి వయా రాజమహేంద్రవరం, జంగారెడ్డిగూడెం, ఖమ్మం మీదుగా హైదరాబాద్‌కి సూపర్ లగ్జరీ బస్సుకి రూ.778, కాకినాడ నుంచి వయా రావులపాలెం విజయవాడ మీదుగా హైదరాబాద్‌కి రూ.809, కాకినాడ నుంచి వయా రాజమహేంద్రవరం విజయవాడ మీదుగా హైదరాబాద్‌కి రూ.806 చొప్పున ఛార్జీలను వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే కాకినాడ నుంచి హైదరాబాద్‌కు అమరావతి బస్సుకి రూ.1238, వెన్నెల 1442, స్టార్ లైనర్ రూ.1048, నైట్ రైడర్ రూ.1103 ఛార్జీలను వసూలు చేస్తున్నాం.

యానాం వార్తలు

కుర్చీ ఆట ఆడుతున్న విద్యార్థినులు

ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి - యానాం రూరల్

మహిళా శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలిక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి నేతృత్వంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మదర్ థెరిసా నర్సింగ్ కళాశాల, ఐటిఐ విద్యార్థినులను ఐలాండ్ నెంబర్ 3, మడ అడవులకు బోటు మార్గంలో తీసుకెళ్లి పర్యావరణ పరిరక్షించే అంశంతో పాటు, సమాజంలో ఆడపిల్లల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేసి లెమన్ స్పూన్ రేస్, మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ అధికారి రెయ్యా శ్రీనివాస్, మురళీధరన్, కోఆర్డినేటర్ ఎ.రిప్కా రోసెలిన్, కె సత్యనారాయణ, కనకాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామర్లకోటలో స్వచ్ఛ రైలు బండ్లు

ప్రజాశక్తి - సామర్లకోట



వందేభారత్ రైలును క్లీన్ చేస్తున్న సిబ్బంది

సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్వచ్ఛ రైలుబండ్లు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో వెయిటింగ్ హాల్స్ శుభ్రపరచడం, 12840 మెయిల్ ఎక్స్‌ప్రెస్,13351 బొకారో ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికులకు చెత్తను డస్ట్‌బిన్‌లలో వేయమని కోరడం, రైలు ప్రయాణీకులకు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించడం, రైళ్ళను పరిశుభ్రంగా ఉంచాలని ప్రోత్సహించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కెవి.గిరి, టికెట్ చెకింగ్ సిబ్బంది, ఆర్‌పిఎఫ్ సిబ్బంది, సఫాయివాల సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమోహన్‌కు మహాత్మా గాంధీ జాతీయ అవార్డు

ప్రజాశక్తి - కాకినాడ

అవార్డు అందుకుంటున్న కృష్ణమోహన్

మనం ఫౌండేషన్ చే ప్రతి సంవత్సరం సామాజిక సేవా రంగంలో ఇస్తున్న మహాత్మా గాంధీ శాంతి సేవా రత్న అవార్డుకు కాకినాడకు చెందిన తాళ్లూరి కృష్ణమోహన్ ఎంపిక య్యారు. శనివారం హైదరాబాద్ లోని సిటీ కల్చరల్ సెంటర్ లోఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్లు, సామాజిక సేవలు చేసే అతిరథ మహారథుల సమక్షంలో కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి చేతుల మీదుగా ఆ అవార్డును కృష్ణమోహన్ అందుకున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరింతగా సామాజిక సేవ చేయడం జరుగుతుందన్నారు. కృష్ణమోహన్ ఈ అవార్డుకి ఎంపిక అవ్వడం పట్ల ఆప్ నాయకులు, స్నేహితులు నరాల శివ, శ్రీనివాస్‌రాజు, పి.సుబ్రహ్మణ్యం, కనకదుర్గ, రియాజ్, పి.లక్ష్మణాచార్యులు, జానకీ రామయ్య హర్షం వ్యక్తం చేశారు.

పిఎం స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - సామర్లకోట

9,10 తరగతి విద్యార్థులకు అందించే పిఎం యశస్వి పథకానికి బీసీ, ఇబిసి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సామర్లకోట ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.75 వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారన్నారు. ఇంటర్ విద్యార్థులకు రూ.1.25 లక్షలు ఇస్తారని, ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. పట్టణంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలకు మించరాదన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్ yet.nta.ac.inలో చూడాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఏర్పాటైన నూతన కార్యవర్గం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అమలాపురం

జిల్లా ఫొటోగ్రాఫర్స్ యూనియన్ ప్రెసిడెంట్ గడ్డం సురేష్, గౌరవ అధ్యక్షులు కాజా బాబు ఆధ్వర్యంలో అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ కార్యవర్గం ఏర్పాటైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా అన్ని మండలాల నుంచి ప్రస్తుత సెక్రటరీలు, అమలాపురం ఫొటోగ్రాఫర్స్ అత్యధికంగా హాజరై కొత్త యూనియన్ ఎన్నుకున్నారు.కొత్త యూనియన్ సభ్యులు అధ్యక్షులు కట్టమూరు కృష్ణ, గౌరవ సలహాదారుడు గురు, దీప్తి మోహన్ ,ప్రెసిడెంట్ చెల్లుబోయిన రమేష్, వైస్ ప్రెసిడెంట్ శివ కుమార్ ,సెక్రటరీ రెడ్డి శ్రీనివాస్, ట్రెజరీ కోటి, జాయింట్ ట్రెజరీ శివకృష్ణ, కార్యవర్గ సభ్యులు బాలాజీ, సతీష్, గోపి సుదర్శన్, రాధాకృష్ణ, హేమ్ చరణ్, శేఖర్, టిఆర్‌కె.కుమార్, పి.శ్రీనివాస్, కె.సీతారాం, రాజీవ్ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ చెల్లుబోయిన రమేష్ మాట్లాడుతూ అన్ని మండలాల యూనియన్ ప్రెసిడెంట్, సెక్రటరీ ల సహకారం తీసుకుంటూ, మా యూనియన్ ఏ సమస్య వచ్చినా ముందుండి సమస్య పరిష్కారం అయ్యేలా చేస్తానని అన్నారు.

మండుతున్న ఎండలు

36 డిగ్రీలు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వర్షాకాలం మొదలైన ఎండాకాలాన్ని తలపిస్తున్నట్టు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రతిరోజు 36 డిగ్రీలు పైగా ఉష్ణోగ్రతలు నమోదవడంతో సామాన్యులు విలవిలాడిపోతున్నారు. వర్షాకాలంలో 29-30 డిగ్రీలు ఉండే ఉష్ణోగ్రతలు ఒకేసారి 35 -36 డిగ్రీలు నమోదవడంతోపాటు ఉక్క పోత మరింత అధికమైంది. దీంతో వద్దులు చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్ రోడ్లన్నీ మధ్యాహ్నం 12 గంటలకు నిర్మాణస్యంగా తయారవుతున్నాయి.

ఉక్కపోతలకు అప్రమత్తంగా ఉండాలి

ఉష్ణోగ్రతలు పెరిగి వేసవిన తలపించడంతోపాటు వాతావరణంలో మార్పుల వల్ల చెమటలు అధికంగా పడుతున్నాయన్నాయి. దీనివల్ల ఒంట్లో నీటి శాతం తగ్గి డిహైడ్రేషన్ వచ్చే అవకాశం ఉందని దీనికి మంచినీరు ఓఆర్ఎస్ ద్రావణం అధికంగా సేవించాలని ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు

నిర్మానుష్యంగా మారిన రహదారి

శివరత్నంకు అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

హెచ్ఎం శివరత్నంకు గురు బ్రహ్మ అవార్డు

ప్రజాశక్తి-కొత్తపేట

మండలంలోని కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నంకు రాజమహేంద్రవరం ఎడ్యుకేషన్ స్పెషల్ విద్యారంగం పత్రిక వారు ' గురు బ్రహ్మ అవార్డు' ప్రదానంచేశారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీ లో జరిగిన సన్మాన కార్యక్రమంలో నన్నయ్య యూనివర్సిటి రిజిస్ట్రార్ జి.సుధాకర్, తూర్పుగోదావరి జిల్లా జిల్లా విద్యాశాఖాధికారి కె వాసుదేవరావు, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి చేతులు మీదుగా మెమెంటో అందజేసి సత్కరించారని కరస్పాండెంట్ రామోజు అనురాధ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, బంధువులు సత్యనారాయణ, శంకర్, రాజు, కిరణ్, సత్తిబాబు వారి కుటుంబ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న పారిశ్రామిక వేత్త పాపారావు

బాధితునికి రూ.15 వేల సాయం

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని పెదపళ్ళకు చెందిన ఏడిద రవికుమార్ అనారోగ్యానికి గురై రాజమహేంద్రవరం ప్రయవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి గ్రామ పెద్దల ద్వారా విషయం తెలుసుకున్న పారిశ్రామికవేత్త, శ్రీమురళీకృష్ణ సంస్థల అధినేత, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు నెక్కింటి బుజ్జి గ్రామ పెద్దల సమక్షంలో ఏడిద రవికుమార్ కుటుంబ సభ్యులకు చికిత్స నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ఉల్లి ధరతో బెంబేలు

కిలో రూ.50 నుంచి రూ.80

ప్రజాశక్తి -మామిడికుదురు

ఉల్లి చేసే మేలు తల్లి చేయలేదంటారు ఉల్లి వాడకం లేనిదే ఏం కూర వండటం సాధ్యం కాదు ఉల్లి వాడకం అధికం అందుకేనేమో ఉల్లి ధర మళ్ళీ ఘాటు ఎక్కిస్తుంది. కిలో 30 నుంచి 40 మధ్య ఉండేది ప్రస్తుతం మార్కెట్లో ఆయా రకాలు నాణ్యతను బట్టి రూ.50 నుంచి రూ.80 లోపు ధర పలుకుతోంది

అధిక వర్షాలతో తగ్గిన దిగుబడి.

మన రాష్ట్రంలో నెల్లూరు పరిసర ప్రాంతాలలో అధికంగా ఉల్లి పంట పండిస్తారు ఉల్లి వాడకం ఎక్కువ కావడం, ఉల్లి పంటలు రైతుల చేతికొచ్చే సమయానికి వరదలకు నష్టం వాటిల్లింది మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి ఉల్లి దిగుమతి జరుగుతోంది మన జిల్లాలో జాతీయ రహదారిపై రావులపాలెం నుంచి రాజమహేంద్రవరం వరకు వివిధ చోట్ల ఉల్లి మార్కెట్లు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుతున్నారు రెండు నెలల్లోనే ఉల్లి ధర రెట్టింపు అవ్వటం తో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. విజయదశమి, దీపావళి, కార్తీకమాసం వరస పండుగలు, ముహూర్తాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఉల్లి వాడకం అధికంగా ఉంటుంది పండుగల నేపథ్యంలో వాడకం ఎక్కువ అవ్వటంతో మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు

పావు కిలోతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి

ప్రస్తుతం మార్కెట్లో ఉల్లిపాయల కొనాలంటే సాధారణ కుటుంబాలకు అందుబాటులో లేని ధరలు ఉన్నాయి. పేద, ధనిక తేడా లేకుండా వంటకాలలో ఉల్లిని వాడతారు ఇటీవల వ్యాపారులు రోజుకొక రేటుతో ఉల్లి ధర పెంచుతూ అమ్ముతున్నారు. కారణం అడిగితే మార్కెట్లో కొరత ఏర్పడిందని చెబుతున్నారు కేజీ కొందామని వెళ్తే పావు కేజీతో సరి పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది

ఉల్లి కొరత తీర్చండి

ఉల్లిపాయ మార్కెట్ ధరలు రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నాయి. ఉల్లి కొరతలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు నాణ్యతకు తగ్గి నిల్వ కు పనికిరాని ఉల్లిపాయలు విక్రయిస్తున్నారు. హోటల్ నిర్వహించడం కష్టంగా ఉంది ఇకనైనా ప్రభుత్వాధికారులు, ప్రజాపతినిధులు స్పందించి ఉల్లి ధర తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలిని కోరుతున్నా.

- మేడేపల్లి చిన్న సత్యనారాయణ, హోటల్ నిర్వహకుడు, అప్పనపల్లి

జాతీయ హ్యాండ్ బాల్ జట్టుకు ప్రణీత్ ఎంపిక

ప్రజాశక్తి-ఆత్రేయపురం

జాతీస్థాయి హ్యాండ్ బాల్ జట్టులో ఆత్రేయపురం చెందిన ముదునూరి ప్రణీత్ వర్మకు స్థానం లభించింది. సిబియస్ఇ సౌత్ జోన్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ,తమిళనాడు, పాండిచ్చేరి, అండమాన్ నికోబార్) రాష్ట్రాలు పాల్గొన్న హ్యాండ్ బాల్ పోటీలలో అండర్ 19 విభాగంలో అనకాపల్లి జిల్లా పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ తరపున ముదునూరి ప్రణీత్ వర్మ తో కలిసిఆడిన జట్టుకు ప్రథమ స్థానం లభించింది. హైదరాబాద్ లో మరియు ది క్రాక్ ప్లానెట్ స్కూల్లో మియాపూర్ లో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలను సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 1 వరకు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ స్థానం పొందిన హ్యాండ్ బాల్ జట్టు జాతీయ స్థాయిలో నేటి నుండి అక్టోబర్ 10 వరకు నాలుగు రోజులపాటు ఉత్తరప్రదేశ్లోని ఘజియాబాద్ జిల్లా మోడీ మోడీనగర్ లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొంటారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట ప్రకాష్ నగర్ విద్యానికేతన్ లో ఇంటర్ చదువుతూ హ్యాండ్ బాల్ జాతీయ జట్టులో స్థానం పొందిన ఆత్రేయపురం గ్రామానికి చెందిన ముదునూరి ప్రణీత్ వర్మను గ్రామస్తులు అభినందిస్తున్నారు

గోతులమయంగా రహదారి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

కపిలేశ్వరపురం ఆర్అండ బి రహదారి గోతులు మయంగా ఉంది. ఈరహదారి పై వాహనదారులు, ప్రయాణికులు అవస్థలు కపిలేశ్వరపురం నుండి పలు ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ రహదారి మీదుగానే వెళ్లాలి. వర్షాలు కురిసే సందర్భాల్లో గోతుల్లో కి నీరు చేరడంతో రహదారి కనపడక వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి మీదుగా భారీ వాహనాలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే అధికారులు అనేక అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో రహదారి పై వెళ్లాలంటే ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు .ఈ రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన నేటికీ రహదారి సమస్య పరిష్కారం కాలేదు. ప్రతి నిత్యం రద్దీగా ఉండే రహదారిని ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రమాదాల బారిన పడకుండావెంటనే మెరుగుపరచాలని లేదా అధ్వానంగా ఉన్న గుంతలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు ప్రయాణికులు విద్యార్థులు కోరుతున్నారు .

అప్పన కుటుంబానికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-మామిడికుదురు

పరామర్శిస్తున్న పిసి సి ఉపాధ్యక్షుడు కొత్తూరి తదితరులు

పితృ వియోగములో ఉన్న మామిడి కుదురు మండల కాంగ్రెస్ అధ్యక్షులు అప్పన శ్రీరామకృష్ణ కుటుంబాన్ని పిసిసి ఉపాధ్యక్షులు కొత్తూరు శ్రీనివాస్ పలువురు ఆదివారం పరామర్శించారు. శ్రీరామకష్ణ తండ్రి కాంగ్రెస్ సీనియర్ నాయకులు అప్పన నరసింహారావు ఇటీవల గుండెపోటుతో మతి చెందారు. ఆయన కుమారులు మామిడి కుదురు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అప్పన శ్రీ రామకృష్ణ మరియు సోదరులను కొత్తూరు శ్రీనివాస్, అమలాపురం పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, జెడ్‌పిటిసి సభ్యులు కసిరెడ్డి అంజిబాబు, ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, జిల్లా బీసీ సెల్ చైర్మన్ కుడుపూడి శ్రీనివాస్, అమలాపురం పట్టణ కార్యదర్శి ముల్లేటి వెంకటేశ్వరరావు తదితరులు పరామర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

LOST OF PASSPORT

I, Sai Krishna Thota, S/o Vishnumurthy Thota resident of Veeravaram Village, lost my original passport No. G0819456 issued by passport office Vishakapatnam, dated 21-12-2006, while I was shifting household goods and documents between Veeravaram village and Kakinada. Insite of my best efforts I, could not trace out its whereabouts. If anybody finds my original passport please intimate the same.

SAI KRISHNA THOTA
Veeravaram, **CELL: 89197 22566**
Date.

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 341/2006

Between:
బోను కనకం -వాది
AND
బోను సోములు (died) వగైరాలు -ప్రతివాద్లు

7వ ప్రతివాది: కండపోతుల జయ, W/o. రవి, 52 సం॥లు, డోర్ నెం. 44-10-15/1, అన్నపూర్ణమ్మపేట, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో 7వ ప్రతివాది అయిన మీకు ఎన్నిసార్లు పై కోర్టు వారి నుండి మరియు పోస్టల్ నుండి సమన్లు పంపించిననూ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. కావున **ది. 14-10-2024 సం॥ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేటు ద్వారా గాని హాజరు అయ్యి మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

వి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం
రామచంద్రపురం అడ్వకేటు, అనపర్తి
05-10-2024 సెల్: 9912946959

నోటీసు
మహారాజశ్రీ కాకినాడ 3వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A. 130/2023
O.S. 447/2017

Between:
పోతుల కృష్ణమూర్తి -వాది
AND
1. దున్నా మోహనరావు వగైరా -ప్రతివాదులు

2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది:
శ్రీమతి దున్నా అనిత, భర్త: దున్నా కామేశ్వరరావు అనే నాని, డోర్ నెంబర్ 5-87, శీల లంక గ్రామము, కాజులూరు మండలం

పై నెంబర్ పిటిషన్‌లో మిమ్ములను దావాలో రెండవ ప్రతివాదిగా చేర్పించమని మీకు శ్రీ కోర్టు వారు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను తీసుకొనక EVADE చేసినందున, నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఇమ్మని శ్రీ కోర్టు వారు ఆర్డరు వేసియున్నారు. ది. 14-10-2024వ తేదీన వాయిదా వున్నది. మీరు వాయిదా రోజు ది **14-10-2024 తేదీన మీరు స్వయముగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥ 10-30 లకు** పై కోర్టుకు హాజరై ఏమైనా అభ్యంతరములు వున్న యెడల మనవి చేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానింపబడునని మీకు తెలియచేయడమైనది

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

ఉప్పులూరి రామారావు, అడ్వకేట్
63-3-4బి, ఉప్పులూరివారి వీధి
కాకినాడ కాకినాడ- 533003
ది.1-10-2024 సెల్: 9949045514